క్లుప్తంగా

పందుల పెంపకందారులపై చర్యలు

గిద్దలూరు రూరల్ (బేస్తవారిపేట): 'మేం పక్కా లోకల్' శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో గతంలో పందుల పెంపకందారులకు నోటీలివ్వడం, పందుల పెంపకం షెల్టర్లను గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌లో ఏర్పాటు చేసేకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పట్టణంలో సంచరిస్తున్న పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేసి పట్టణానికి 5 కిలో మీటర్ల దూరంలో పెంచుకునే విధంగా, లక్ష్మీనరసింహాస్వామి ఆలయం సమీపంలో, రాచర్ల గేట్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద బహిరంగ మలవిసర్జనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు బస్‌పాసులు

రాచర్ల: గిద్దలూరు పట్టణంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు రాచర్ల గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ (సామాజిక సేవ కార్యకర్త) ఉలాపు శివశంకర్ నాయుడు రూ.12 వేలు ఖర్చు చేసి గిద్దలూరు, తురిమెళ్ల, కంభం, అనుమలవీడు గ్రామాలకు చెందిన పవన్, సాకేత్, దీన కుమారి, మాకోబ్, రాణి, సుజాత అనే ఆరుగురు పేద విద్యార్థులకు బస్ పాసులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మురుగు కాల్వలో చెత్త తొలగింపు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తను పంచాయితీ సిబ్బంది తొలగించారు. గ్రామంలోని ఖాళీ స్థలాలు, రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. పంచాయతీ సెక్రటరీ అచ్యుతరావు, వాటర్‌మెన్ బాదుల్లా, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో చైతన్యం రావాలి

మార్కాపురం రూరల్: వారం రోజులుగా సోషల్ మీడియాల్లో, టీవీల్లో ప్రసారమవుతున్న ఎండోమెంటు అసిస్టెంటు కమిషనర్ శాంతి సంఘటనలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఖండించాలని దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ చిట్టెం మార్కు కోరారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని టీవీల్లో, సోషల్‌మీడియాల్లో ఆమెపైన చేస్తున్న విమర్శలను ఎస్సీ, ఎస్టీలు తిప్పికొట్టాలని, ఈ సంఘటనతోనైనా దళితులందరూ ఒకే వేదికపైకి వచ్చి ముక్తకంఠంతో ఖండించాలని లేదంటే భవిష్యత్తులో ఎస్టీలు ఉద్యోగాలు చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీ కులానికి చెందిన శాంతిని టార్గెట్ చేస్తూ విషప్రచారం చేస్తున్న సంఘటనను అగ్రవర్ణాల దాడిగా పరిగణించాలని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో చైతన్యం ద్వారానే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని మార్కు తెలిపారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ తిరుమలనాథస్వామి ఆలయం భూముల కౌలు వేలం పాట 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవ రెడ్డి బుధవారం తెలిపారు. వేలం పాట ఆయా గ్రామాల రామాలయాల వద్ద జరగనున్నట్లు వివరించారు. ప్రతి పాటదారుడు పాటకు ముందుగా రూ.2 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాట పూర్తైన వెంటనే ఒక ఏడాది ముందుగా మక్తా చెల్లించాలని, అలా చెల్లించకుంటే ధరావత్తు ఫర్ ఫీట్ చేయబడునని, తిరిగి బహిరంగ వేలం పాట నిర్వహిస్తారని, దేవస్థానానికి బకాయిలు ఉన్న వారు గానీ దేవస్థానములో ఎట్టి లావాదేవీలు ఉన్న వారు గానీ వేలం పాటలో పాల్గొనేందుకు అర్హులుకారని, పూర్తి వివరాలకు 80999 49996 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పొదిలి విద్యార్థులకు చెస్‌లో బంగారు పతకాలు



పతకాలు అందుకుంటున్న విజేతలు

పొదిలి: దర్శిలో ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ పోటీలు జరిగాయి. పొదిలికి చెందిన విద్యార్థులు దర్శి భాష్యం పాఠశాలలో చదువుకుంటున్నారు. పొదిలి బేసిక్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సామి నిహాల్ సువిత్, సామి విహాల్ సువిత్ సోదరులు ఈ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ జగదీష్ చేతుల మీదుగా బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. విజేతలను తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

కులమతాలకు అతీతంగా పీర్ల ఉత్సవం



పొదిలిలో పీర్ల ఉత్సవంలో భక్తులు



వెలుగొండ్రాయునిపల్లిలో పీర్ల ఉత్సవం



నగరోత్సవంలో గొర్లగడ్డ పీర్లు

కొనకనమిట్ల: కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పెద్ద షరిగేసు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి పీర్ల ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు. మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిడిలను, ఉత్సవ పీర్లను ముస్తాబు చేశారు. బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, నాగరాజుకుంట, చినారికట్ల, నాయుడుపేట గ్రామాల్లో హోమ గుండాలు ఏర్పాటు చేసి పీర్ల ఉత్సవం చేశారు. బుధవారం పీర్లకు స్నాన కార్యక్రమాలు నిర్వహించి మళ్లీ పీర్ల చావడిలో భద్రపరిచారు.

వైభవంగా పీర్ల మిలాఖత్ ఉత్సవం

పొదిలి: త్యాగాలకు ప్రతీకగా భావించే మొహర్రం పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం రాత్రి పీర్ల మిలాఖత్ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తూర్పుపాలెం, పడమరపాలెం, విశ్వనాథపురం పీర్ల ప్రధాన రహదారిలోని అమ్మవారిశాల వద్ద మిలాఖత్ ఉత్సవం జరిగింది. అంతకు ముందుగా ఆయా ప్రాంతాల నుంచి పీర్లు ఊరేగింపుగా మిలాఖత్ వద్దకు చేరాయి. సీఐ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో ఎస్సైలు కోటయ్య, మాధవరావు వారి సిబ్బందితో పాటు, అదనపు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా చిన్న షరిగత్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్లకు చిన్న షరిగత్‌ను నిర్వహించారు. పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధుల్లోని పీర్‌లెన్ష బాదుల్లా సాహేబ్, చిన్న బాదుల్లా సాహేబ్ పీర్లకు వైభవంగా షరిగత్ నిర్వహించారు. అలంకరించిన పీర్లను పట్టుకొని నిప్పులపై నడిచారు. అనంతరం పీర్లను ఎత్తుకుని తప్పెట్లు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద షరిగత్ సందర్భంగా దర్గాలో కొలువై వున్న పెద్దఖాశీం, చిన్న ఖాశీం పీర్లను ముజావర్లు దట్టీలతో ప్రత్యేకంగా అలంకరించారు. అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటారు. డప్పులు, వాయిద్యాలతో గ్రామస్తులు దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి స్వామివార్లకు నైవేద్యం సమర్పించారు. ఇమామే ఖాశీం వంశీయుల త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలను ముస్లింలు, హిందువులు కలసి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ క్రమంలో తుమ్మలచెరువు గ్రామం బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల రాకతో కిటకిటలాడింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ముజావర్ల ప్రత్యేక ప్రార్థనల అనంతరం గ్రామోత్సవం ప్రారంభమైంది. పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై మొక్కులు తీర్చుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొదిలి సీఐ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మండలకేంద్రం తర్లుపాడు, కలుజువ్వలపాడు, పోతలపాడు, గానుగపెంట, గోరుగుంతలపాడు గ్రామాలలో కూడా మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం



తర్లుపాడులో ఊరేగుతున్న పీర్లు

కంభం: మొహర్రం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హజరత్‌గూడెంలో మంగళవారం రాత్రి పెద్ద సరిగేసు నిర్వహించగా బుధవారం సాయంత్రం పారువేట కార్యక్రమం నిర్వహించారు. పీర్లచావిడి నుంచి పీర్లను గ్రామోత్సవంగా చింతలపాలెం వద్ద ఉన్న కత్వవరకు తీసుకొచ్చి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జనం

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లచావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. పీర్లతో అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. బేస్తవారిపేట, పాపాయిపల్లె, చింతలపాలెం గ్రామాల్లో సాయంత్రం మేళ, తాళాలతో కన్నుల పండువగా గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనం కోసం తరలించారు. సోమవారిపేట సమీపంలోని చీతిరేల కతువ వద్ద నిమజ్జనం చేశారు.



నిమజ్జనం సందర్భంగా పీర్లతో గ్రామోత్సవం



హజరత్‌గూడెం గ్రామోత్సవంలో పీర్లు

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి

● తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవ స్వామి వారికి ప్రత్యేక అలంకారం నిర్వహించి అర్చకులు పూజలు నిర్వహించారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి మహిళా వికాస తరంగిణి భక్త బృందం ఆధ్వర్యంలో భగవద్గీతలోని 18 అధ్యాయాల పారాయణం చేశారు. వివిధ ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

మార్కాపురం: పట్టణానికి సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్ రాంబాబు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్న స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ఆలయ నిర్మాణ దాత, ఆర్య వైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, ఆయన సతీమణి మాజీ ఎంపీటీసీ సభ్యులు మాధవి, కుమారుడు చేతన్‌బాబు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు కల్వా సత్యనారాయణ, సామి రాజా, సోమిశెట్టి చిరంజీవి, యాదాల వెంకటేశ్వర్లు, ఇన్నమూరి నారాయణ, కొండవీటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కోటి కుంకుమార్చన

పట్టణంలో శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు రెండు పూటలా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఎస్. నాగేశ్వరరావు, పెరుమాళ్ళ భాస్కర్, సాయి, రవి, పొనుగుపాటి కోటేశ్వరరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, షరాబ్ బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాలతో పాటు అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాయత్రిమాత ఆలయంలో గాయత్రి పరివార్ సభ్యుల ఆధ్వర్యంలో గీతాపారాయణం చేశారు. పెద్దమార్కెట్ వద్ద సాయిబాబా ఆలంయలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: హిందువుల తొలి పండగ తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేటలోని రామాలయం, దరగకొండపై త్రిలోక పుణ్యక్షేత్రం భక్తులతో నిండిపోయింది. ఆలయాల్లో విష్ణుసహస్ర నామ పారాయణం, ఉపవాసదీక్షలు, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు.



లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు రాంబాబు



కోటి కుంకుమార్చన పూజల్లో మహిళలు



పారాయణం చేస్తున్న మహిళా భక్తులు



పూజలు చేస్తున్న భాస్కర్ దంపతులు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే అన్నా పరామర్శ

కంభం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన జంగంగుంట్ల గ్రామానికి చెందిన దేశిరెడ్డి సుబ్బారెడ్డి, అనారోగ్యంతో మృతి చెందిన సబ్బసాని అంకమ్మ కుటుంబ సభ్యులను బుధవారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, పాలగిరి శరభారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి ఉన్నారు.

మూడో రోజుకు చేరిన నిరాహార దీక్షలు



దీక్షకు మద్దతు తెలుపుతున్న సంఘం నాయకులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈక్రమంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు బుధవారంతో మూడో రోజుకు చేరాయి. డిపో సెక్రటరీ ఓబులేసు, యుఎన్.రావు ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షల్లో డిఎం.దాసు, భీమయ్య, కొండలు కూర్చున్నారు. సీసీఎస్ డెలిగేట్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.సాంబశివరావు దండలు వేసి దీక్షను ప్రారంభించారు. డిపోలో అధికారులు వ్యవహరిస్తున్న తీరును నాయకులు తమ ప్రసంగాల్లో ఎండగట్టారు. డిపోలో జరుగుతున్న లోపాలపై తగు విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకునేంత వరకు నిరాహార దీక్షలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

వెలిగొండతోనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ఎమ్మెల్యే కందులను పరామర్శించి ఎంపీ మాగుంట

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టుతోనే ఈ ప్రాంతంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు, జిల్లా ఏర్పాటుపై త్వరలో ఈ ప్రాంత ఎమ్మెల్యేలతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి ప్రత్యేకంగా చర్చిస్తామని అన్నారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం వెలిగొండ ప్రాజెక్టుతోనే పరిష్కారమవుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు వలన 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని, 18 లక్షల మందికి తాగునీరు లభిస్తుందని మాగుంట అన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే కందులకు సూచించారు. ఈయన వెంట జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

రికవరీ అధికారి-II వారి యొక్క కార్యాలయము
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవలు యొక్క విభాగము, భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము)
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.
ఫోన్: 0891-2957045. ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

RP/46/2020 in OA/200/2018

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (మునుపటి ఆంధ్రాబ్యాంక్), కందుకూరు బ్రాంచ్, ప్రకాశం జిల్లా
వర్సెస్
మెస్సర్స్ ఎస్.హెచ్.మోటర్స్ ప్రై. లి., ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కుంభ హరిబాబు & ఇతరులు

విషయము: ఇ-వేలం అమ్మకం యొక్క వాయిదా

ఇందుమూలముగా సంబంధిత యావన్మందికి తెలియచేయునది ఏమనగా, ఒకే బిడ్ నిర్ణయించబడిన మరియు క్లెయిమ్ పిటీషన్ IA/153/2024 థర్డ్ పార్టీ ద్వారా దాఖలు చేయబడినందున CHr బ్యాంక్ అభ్యర్థన మేరకు ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం నోటీసు తేది.01.06.2024 ప్రకారం వెబ్‌సైట్: https://www.bankeauctions.com నందు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించు ఇ-వేలం అమ్మకం తేది.19.07.2024 నుండి తేది.08.08.2024 నాటికి వాయిదా వేయబడినది. బిడ్స్ సమర్పించుటకు మరియు ఐయానా డిపాజిట్ సమర్పించుటకు చివరి తేది.06.08.2024 మరియు బిడ్ల యొక్క హార్డుకాపీ సమర్పించుటకు చివరి తేది.07.08.2024. ఇ-వేలం నోటీసు తేది.01.06.2024 నందు ఉన్న ఇతర నియమ నిబంధనలలో ఏవిధమైన మార్పులు లేవు.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.18 జూలై, 2024 న జారీచేయబడినది)

(బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె.బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్